ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 20 జూలై 2024



'ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలి'

పార్వతీపురం రూరల్: మై స్కూల్ మై ప్రైడ్ (నా బడి-నాకు గర్వకారణం) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండుసార్లు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయాలని, ఉన్నత చదువులు, ఉద్యోగాలు, వివిధ రంగాల్లో అవకాశాలు తెలియజేయాలని సూచించారు. టెన్త్ విద్యార్థులపై శ్రద్ధ వహించడమే కాకుండా 8, 9 తరగతుల వారికి కూడా మంచి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

వదలని వాన

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- ముంపులో లోతట్టు ప్రాంతాలు
- పంట పొలాల్లోకి చేరిన నీరు
- నదులకు వరద
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

తోటపల్లి స్పిల్‌వే నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం



పార్వతీపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): తీవ్ర అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజుల నుంచి.. మధ్య మధ్యలో ఆగి కురుస్తున్న వానలకు జిల్లాలో వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వంశధార, నగావళి నదులకు వరద పోటెత్తుతోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు, కూడళ్లపై నీరు నిలిచింది. పంట పొలాలు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. గురువారం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు జిల్లాలో 351.6 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. పార్వతీపురంలో అత్యధికంగా, గుమ్మలక్ష్మీపురంలో అత్యల్పంగా వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి వరకూ జిల్లావ్యాప్తంగా వర్షం కురుస్తూనే ఉంది. కాగా ఈ వాతావరణం వ్యవసాయానికి అనుకూలం కావడంతో ఖరీఫ్ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు, ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వర్షాల కారణంగా అత్యధికులు ఇళ్లకే పరిమితమయ్యారు. కాగా వర్షాలు తగ్గిన తర్వాతే రైతులు పొలం పనులకు శ్రీకారం చుట్టడం మంచిదని వ్యవసాయాధికారులు, నిపుణులు చెబుతున్నారు. పిడుగులతో పాటు పాము కాటుకు గురై అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

అంతర్రాష్ట్ర రోడ్డుపై దిగబడిన లారీ

కొమరాడ : పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో గుమడ గ్రామం వద్ద గోతిలో ఓ లారీ దిగబడింది. దీంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా గుమడ గ్రామం వద్ద రహదారిపై ఏర్పడిన గోతిలో నీరు చేరింది. దీంతో నాలుగు రాష్ట్రాలకు చెందిన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. తక్షణ ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు స్పందించి జిల్లా పరిధిలోని రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.



గుమడ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై గోతిలో దిగబడిన లారీ

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

పార్వతీపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అప్రమత్తం చేశారు. వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌డబ్ల్యూలతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచివెళ్లరాదని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమాచారం అందించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని, లోతట్టు ప్రాంతాలవాసులను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా చూడాలన్నారు. ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురి కాకుండా చూసుకోవాలని వెల్లడించారు. వరదల సమయంలో ప్రజలు పాము, తేలుకాట్లుకు గురయ్యే ప్రమాదముందన్నారు. వ్యాధులు ప్రబలడానికి అవకాశం ఉందని, వాటి చికిత్సకు అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే.. తక్షణ పునరుద్ధరణకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల అనంతరం పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విపత్తులు సంభవించే ప్రదేశాలను గుర్తించాలని తెలిపారు.

చెరువును తలపిస్తున్న రహదారి

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ప్రధానంగా గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర వద్ద రోడ్డు చెరువును తలపిస్తోంది. గోతుల్లో వర్షపునీరు చేరడంతో రోడ్డు ఎక్కడుందో వెతుక్కోవాల్సిన దుస్థితి. దీనిపై పత్రికల్లో కథనాలు వెలువడడంతో ఈ మార్గంలోని భారీ గోతుల్లో ఇటీవల మట్టిని పూడ్చారు. అయితే కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మట్టి బురదమయం కావడంతో వాహనదారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. వర్షాలు మరింతగా కురిస్తే ఈ మార్గంలో ప్రయాణించడం కష్టమని, భారీ ప్రమాదాలు సంభవించకముందే సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

నాగావళికి వరద

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం పెరిగింది. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పైనుంచి వరద పోటెత్తడంతో శుక్రవారం స్పిల్‌వే గేట్లు తెరచి.. దిగువకు నీటిని విడిచిపెట్టారు. పైనుంచి నదిలోకి 1500 క్యూసెక్కులు రాగా.. దిగువ ప్రాంతానికి వెయ్యి క్యూసెక్కులను వదిలారు. ప్రధాన కాలువల నుంచి 210 క్యూసెక్కులను సరఫరా చేశారు. ప్రాజెక్టుతో పాటు నదీ ప్రాంతాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. వరద ప్రవాహం పెరిగితే దిగువకు మళ్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ప్రాజెక్టు డీఈ టి.రఘునాథనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌లు తెలిపారు.



ఉల్లిభద్ర సమీపంలో ప్రధాన రహదారి ఇలా..

వర్షం కురిస్తే.. ముంపే..

- ఇదీ జిల్లాకేంద్రంలో పరిస్థితి..
- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న వరద, మురుగునీరు
- పట్టణవాసులకు తప్పని ఇబ్బందులు
- ఏటా వానాకాలంలో నరకం..
- కలగా మారిన భూగర్భ కాలువల నిర్మాణం
- దానిపై దృష్టి సారించని గత వైసీపీ సర్కారు
- నూతన ప్రభుత్వంపై ఆశలు



పార్వతీపురంలో ప్రధాన రహదారిలో షాపుల ముందు నిలిచిన మురుగునీరు

పార్వతీపురంటౌన్, జూలై 19 : వర్షం కురిస్తే చాలు.. జిల్లాకేంద్ర వాసులకు ముంపు సమస్య తప్పడం లేదు. ప్రధాన రహదారితోపాటు పలు కాలనీల్లో మురుగు, వరదనీరు నిలిచిపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్నేళ్ల కిందట జిల్లా కేంద్రంలో భూగర్భకాలువల నిర్మాణానికి గాను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. వరదనీటిని శుద్ధి చేసి 30వార్డుల్లో ప్రజలకు తాగునీరు అందించాలనుకున్న ప్రణాళికలు కూడా కార్యరూపం దాల్చలేదు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ వల్ల ప్రధాన రహదారిలో రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు, వరద, మురుగు నీటిని కూడా పంపించేందుకు అప్పట్లో ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకున్నా.. ఫలితం లేకుండా పోయింది. దీనిపై గత వైసీపీ సర్కారు కూడా దృష్టి సారించలేదు. మరోవైపు పట్టణంలోని కాలువలపై ఆక్రమణలు పెరిగిపోగా, తూతూ మంత్రంగా పూడికతీత పనులు చేపట్టడంతో ఏటా వర్షాకాలం జిల్లాకేంద్రవాసులు నరకం చూస్తున్నారు. ప్రస్తుతం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాకేంద్రంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బెలగాం పోలీసు బీటు, మేదర వీధి కూడలి, ప్రధాన రహదారి, కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి పాతబస్టాండ్ కూడలి వరకు మెకాళ్లలోతు వరకు వరదనీరు నిలిచింది. మురుగునీరు కూడా ప్రధాన రహదారిపైకి చేరడంతో నివాసితులు, వ్యాపారులు బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిలోనూ ఎక్కడికక్కడే వర్షపు, మురుగునీరు నిలిచిపోవడంతో వాహనదారులు , పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఏటా వర్షాకాలంలో ఎదుర్కొంటున్న ఈ సమస్య నుంచి గట్టెక్కించాలని , ముంపు బాధను తప్పించాలని జిల్లాకేంద్రవాసులు నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కూడా స్పందించి భూగర్భ కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్ ఏమన్నారంటే..

ముంపు సమస్యపై పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. రెండు రోజుల్లో ప్రధాన రహదారిలో కాలువల్లో పూడికలు తీయిస్తామన్నారు. ఆక్రమణలు తొలగించి.. సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు.

ఏటా కష్టాలు

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ప్రధాన రహదారికి ముంపునకు గురవుతుంది. రాకపోకలు సాగించడం ఇబ్బందిగా మారుతుంది. ఏటా ఇవే కష్టాలను ఎదుర్కొంటున్నాం.. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాలి.

- పిన్నింటి రమణ, పార్వతీపురం

ఇబ్బందులు పడుతున్నాం..

పట్టణంలో వరద, మురుగునీటి మళ్లింపునకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏటా వర్షాకాలంలో ప్రధాన రహదారిలో మా ఇళ్లు, షాపులు ముంపునకు గురవుతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నాం. మరోవైపు దుర్వాసన, దోమలతో రోగాలపాలవుతున్నాం.

- వి.శంకరరావు, వ్యాపారి, పార్వతీపురం

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- నూతన ఎస్పీ మాధవరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ

పార్వతీపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేయనున్నట్లు నూతన ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన పార్వతీపురంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 'మన్యం' మూడో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన్యం జిల్లాకు ఎస్పీగా రావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో ప్రధాన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. ఇందుకు ప్రతిఒక్కరి సహకారం అవసమని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలతో పాటు మద్యం, సారా, గంజాయి అక్రమ రవాణా, విక్రయాల కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిశారు. ఏఎస్పీ దిలీప్‌కిరణ్, పార్వతీపురం ఎస్‌డీపీవో సునీల్‌సరోన్, పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్‌బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



ఏఆర్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

కిండంగిలో డెంగ్యూ

- అప్రమత్తమైన వైద్య సిబ్బంది

సీతంపేట: సీతంపేట మండలం కిండంగి గ్రామంలో డెంగ్యూ కేసు నమోదైంది. ఇటీవల ఆ గ్రామంలో వైద్య సిబ్బంది రక్తపరీక్షలు నిర్వహించారు. రక్తపూతలను పాలకొండ ఏరియా ఆసుపత్రికి పంపించారు. అక్కడి వైద్య సిబ్బంది వాటిని పరీక్షించగా... ఆ గ్రామస్థుల్లో జ్వరంతో బాధపడుతున్న ఎనిమిదేళ్ల బాలుడికి డెంగ్యూ పాజిటివ్‌గా గుర్తించారు. వాస్తవంగా పది రోజుల కిందట ఆ బాలుడి సోదరుడు కూడా డెంగ్యూ జ్వరంతో బాధపడ్డాడు. ఇంటి వద్దే ఉండి చికిత్స పొందాడు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగవడంతో మండలంలోని ఓ గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నాడు. కాగా అదే కుటుంబంలో మరో బాలుడికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో స్థానిక వైద్య సిబ్బంది అప్రమత్తమైంది. ఆ ఇంటిలో ఉన్న వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి దోమల నివారణ ద్రావణం పిచి కారీ చేశారు. మండల ప్రత్యేకాధికారి సింహాచలం, ఎంపీడీవో గీతాంజలి శుక్రవారం ఆ గ్రామానికి చేరుకుని పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, మహిళా పోలీస్ అరుణ, ఏఎన్ఎం నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

- ప్రత్యేక జీవో జారీ చేసిన అధికారులు

పార్వతీపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియకు ముందు ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు త్వరలోనే సొంత జిల్లాకు రానున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాలో పనిచేసిన 15 మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయంలో పనిచేసిన అధికారులను ఇతరజిల్లాలకు బదిలీ చేశారు. అయితే వారందరినీ తిరిగి సొంత జిల్లాలకు పంపించేందుకు అవసరమైన ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగానే ఉన్నతాధికారులు ప్రత్యేక జీవోను జారీ చేశారు. ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు త్వరలోనే వారి సొంత జిల్లాలకు రానున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కలెక్టర్ వారికి మండలాలను కేటాయించనున్నారు.

చెక్ పెట్టగలరా?

- 'మన్యం'లో జోరుగా సారా అక్రమ రవాణా, విక్రయాలు
- ఒడిశా నుంచి యథేచ్ఛగా దిగుమతి
- గత వైసీపీ సర్కారు హయాంలో పెరిగిన దందా
- వాటి కట్టడికి చెక్‌పోస్టులు ఎంతో అవసరం
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటున్న జిల్లావాసులు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నాటుసారా జోరు ఏ మాత్రం తగ్గడం లేదు. యథేచ్ఛగా అక్రమ రవాణా, విక్రయాలు సాగుతున్నాయి. గత వైసీపీ సర్కారు హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అక్రమార్కులు... ఇప్పుడూ అదే పంథాలో కొనసాగుతున్నారు. సాఫీగా తమ దందాను కొన సాగిస్తున్నారు. కొందరు స్థానికంగానే సారా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మరికొందరు సరిహద్దుల్లోని ఒడిశా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పోలీసులు, ఎస్ఈబీ అధికారుల కళ్లుగప్పి.. అమ్మకాలు చేపడుతున్నారు. గంజాయిని కూడా ఇదే విధంగా జిల్లాకు తెప్పించి విక్రయాలు చేపడుతున్నారు.

కేసులు ఇలా..

జిల్లాలో 2022లో 583 కేసులు నమోదు చేయగా.. 825 మందిని అరెస్టు చేశారు. వాటికి సంబంధించి 113 వాహనాలను సీజ్ చేశారు. 2023లో 552 కేసులు నమోదు చేసి, 645 మందిని అరెస్టు చేశారు. 91 వాహనాలను సీజ్ చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 417 కేసులు నమోదు చేయగా.. 460 మందిని అరెస్టు చేశారు. వాటికి సంబంధించి 43 వాహనాలను సీజ్ చేశారు. జిల్లాలో ఈ విధంగా కేసులు నమోదవుతున్నప్పటికీ నాటుసారా నివారణ మాత్రం జరగడం లేదు. ఎస్ఈబీతో పాటు పోలీస్ శాఖాధికారులు జరిపిన దాడుల్లో పట్టుబడుతున్న వ్యాపారులు ఏ మాత్రం మారడం లేదు. వారిపై కేసులు నమోదవుతున్నా.. జంకడం లేదు. అరెస్టు అయిన వెంటనే విడుదల కావడంతో.. చాలామంది నాటుసారా వ్యాపారులు తిరిగి యథావిధిగా తమ దందాను కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గత ఐదేళ్లలో కొంతమంది వైసీపీ నాయకులు పరోక్షంగా సారా వ్యాపారులకు సహకారం అందించారనే ఆరోపణలున్నాయి. అందుకే నాటుసారా వ్యాపారులు అధికారులకు భయపడకుండా.. తమ దందాను కొనసాగించారనే వ్యాఖ్యలు లేకపోలేదు. భామిని మండలంలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసిన సందర్భంలో ఒక ఎస్ఐపైనే వారు దౌర్జన్యం చేశారు. నాటుసారా వ్యాపారులు కొంతమంది పోలీసులపైనా దాడి చేశారంటే.. నాటి పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

చెక్‌పోస్టులు ఎంతో అవసరం...

పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతంపేట, కురుపాం, భామిని తదితర సరిహద్దు మండలాలకు ఒడిశా గ్రామాల నుంచి యథేచ్ఛగా నాటుసారా దిగుమతి అవుతుంది. పాచిపెంట మండలం పి.కోనవలస వద్ద మినహా మరెక్కడా చెక్‌పోస్టులు లేకపోవడంతో సారా వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఒడిశా నుంచి దిగుమతి చేసుకుని జిల్లాలో ప్రతి ప్రాంతానికి సారాను సరఫరా చేస్తున్నారు. చెక్‌పోస్టులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు బరితెగిస్తున్నారు. సారాతో పాటు గంజాయిని కూడా ఒడిశా నుంచి తెప్పించుకుని .. జిల్లా వ్యాప్తంగా విక్రయాలు చేపడుతున్నారు. దీనిపై నూతన ఎస్పీ మాధవ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది. చెక్‌పోస్టులు ఏర్పా టు చేసి.. సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేసి.. సారా, గంజాయి వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని జిల్లావాసులు కోరుతున్నారు.



పాచిపెంట మండలం పి.కోనవలసలో చెక్‌పోస్టు ఇలా..

గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జోరువానలో గిరిశిఖర గ్రామాలైన నేంద్రుకోన, పెంగువ, రేగిడిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుధ్యం, వైద్య శిబిరం, అంగన్‌వాడీ కేంద్రం, వ్యవసాయ పనులు, పాఠశాలలు, తాగునీటి సరఫరాను పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరుపుకోవాలని, డెలివరీ తేదీకి ముందుగానే వసతిగృహాల్లో చేరాలని ఆయన సూచిం చారు. రక్తహీనతకు గురికాకుండా సక్రమంగా పౌష్టి కాహారం తీసుకోవాల న్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి.. దోమతెరలను పంపిణీ చేశారు. అనంతరం పెంగవ, రేగిడిలో ప్రాథమిక పాఠశాలలను సందర్శిం చారు. నిబద్ధతతో బోధించాలని, విద్యార్థులకు పాటల రూపంలో పాఠ్యాంశాలు నేర్పాలని, వారిలో నైపుణ్యాలను పెంపొందించాలని టీచర్లకు సూచించారు. ప్రజలకు రక్షిత నీటిని అందించాలని, డయేరియా, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీవో విష్ణు చరణ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్, డీఎంవో జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆంధ్ర యూనివర్సిటీలో బీఎస్-ఎంఎస్



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. మొదటి మూడేళ్లు ఆంధ్ర యూనివర్సిటీలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీటెక్ డిగ్రీ; బీటీహెచ్ నుంచి బీఎస్-ఎంఎస్ డిగ్రీ లభిస్తాయి. బీటీహెచ్‌లో నాలుగో ఏడాది పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఏయూ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి.

ప్రోగ్రామ్స్ వివరాలు

1. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్స్
2. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
3. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్

అర్హతలు: ఏపీ ఇంటర్ బోర్డ్/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీ సెట్ 2024/టీజీ ఈఏపీ సెట్ 2024/ ఏయూఈఈటీ 2024 స్కోర్ తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు టోఫెల్ 575/90 స్కోర్ ఉండాలి. లేదా ఐఈఎల్‌టీఎస్‌లో మొత్తమ్మీద 6.5, సెక్షనల్‌గా 5.5 గ్రేడ్‌కు తగ్గకుండా ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను ఏపీ ఈఏపీ సెట్ 2024, టీజీ ఈఏపీ సెట్ 2024, ఏయూఈఈటీ 2024 స్కోర్ల ద్వారా అలాట్ చేస్తారు.

- **అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు:** రూ.4000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 23
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, internationalaffairs.au@gmail.com
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Mx7wZFHలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ రౌండ్ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మొత్తం 89 సీట్లు ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 26న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో నిర్దేశించిన ప్రకారం కనీసం 55 లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 26న ఉదయం తొమ్మిదిన్నరకు
- **వేదిక:** సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్, అడ్మిన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్-500046.
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంట్రప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంట్రప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌నకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. నెలకు రూ.2000ల స్టయిపెండ్ ఇస్తారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు; టీసీ; ఆధార్ కార్డ్; కమ్యూనిటీ సర్టిఫికెట్; అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in


నవ్య | చిత్రజ్యోతి

అరుదైన గౌరవం!

మెల్‌బోర్న్ వేదికగా జరిగే 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ 15వ ఎడిషన్‌కు హీరో రామ్‌చరణ్ అతిథిగా హాజరు కానున్నారు. ఇందులో బహూకరించే సినిమా అవార్డులకు తన స్టార్ పవర్‌ను జోడించడం ఆసక్తికరం. భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్‌గా అవార్డ్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ 'మన భారతీయ చిత్రాల్లోని వైవిధ్యాన్ని, గొప్పదనాన్ని అంతర్జాతీయ వేదికగా వేడుక నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ వేడుకలో పాల్గొనే అవకాశం రావడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున నేను ప్రాతినిధ్యం వహించడం ఆనందం కలిగించే అంశం. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖుల్ని, అభిమానుల్ని కలుసుకోవడానికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నాను' అన్నారు.



ఏజెంట్ జాన్ స్నో



నితిన్, శ్రీలీల జంటగా రూపుదిద్దుకుంటున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇందులో సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో పాత్రను పోషిస్తున్నారు. ఆయన అసలు పేరు జనార్థన్ సున్నిపెంట అయితే జాన్ స్నో గా మార్చుకోడం ఆసక్తికరం. శుక్రవారం రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. చిత్రంలో ఆయనది కీలకమైన పాత్ర అనీ, వినోదభరితంగా ఉంటుందని దర్శకుడు వెంకీ చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదలవుతుంది.

వివాదం విచారణ వివరణ

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో చల్లగాలులు పలకరిస్తుంటే కోర్టు కేసులు, పోలీసు విచారణలు, విడాకులు, వివరణల వార్తలతో చిత్రసీమ వేడెక్కింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమలు శుక్రవారం పలు వివాదాలతో వార్తల్లో నిలిచాయి.



వివాదం

రూ. పాతిక కోట్లకు పరువునష్టం దావా

'కల్కి 2898 ఏడీ' చిత్రానికి వచ్చిన వసూళ్లు అంతా ఫేక్ అనే వ్యాఖ్యలు చేసిన బాలీవుడ్ సినీ విమర్శకులు సుమిత్ కడేల్, రోహిత్ జైస్వాల్‌పై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేసింది.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి' చిత్రం బాక్సాఫీసు దగ్గర సత్తా చాటుతోంది. ఇటీవలే రూ. వెయ్యికోట్ల క్లబ్‌లో చేరినట్లు వైజయంతి మూవీస్ ప్రకటించింది. అయితే ఇవన్నీ ఫేక్ కలెక్షన్‌లు అని సుమిత్, రోహిత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. రూ. 800 కోట్లు వస్తే, రూ. వెయ్యి కోట్లు అని చెబుతున్నారని విమర్శించారు. దీంతో వైజయంతి మూవీస్ రంగంలోకి దిగింది. 'కలెక్షన్లు ఫేక్ అని మీకు ఎవరు చెప్పారు? మీ దగ్గర ఉన్న ఆధారాలే మిటో చూపించండి, లేదా రూ. 25 కోట్లు చెల్లించండి' అని నోటీసులు పంపింది. గతంలోనూ ఇలాగే సుమిత్, రోహిత్ ప్రభాస్ చిత్రాలను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు.


విడాకులు నిజమేనా?

అభిషేక్‌బచ్చన్, ఐశ్వర్యారాయ్ బచ్చన్ దంపతుల విడాకులు ఖాయమనే ప్రచారం కొన్నాళ్లుగా బాలీవుడ్ సర్కిళ్లలో విస్తృతంగా ప్రచారమవుతోంది. అయితే అభిషేక్‌బచ్చన్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఐశ్వర్య తాముకలిసే ఉన్నామంటూ చెప్పకనే చెప్పారు. అయినా ఆ ప్రచారం మాత్రం ఆగలేదు. ఇటీవలే అనంత్ అంబానీ పెళ్లికి సైతం వీరిద్దరూ విడివిడిగా రావడమే గాకుండా ఫొటోలు సైతం విడిగానే దిగారు. దీంతో మరోసారి వీరి విడాకుల వ్యవహారం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు అభిషేక్‌బచ్చన్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ విడాకుల పోస్టుకు లైక్ కొట్టారు. దీంతో వీరిద్దరూ విడిపోబోతున్నారు కాబట్టే అభిషేక్ ఆ పోస్టుకు లైక్ కొట్టాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రచయిత హీనా ఖండేల్‌వాలా షేర్ చేసిన ఆ పోస్ట్‌లో ఏముందంటే 'కొన్నిసార్లు జీవితం మనం అనుకున్నట్లు సాగదు. విడిపోవడం అనేది అనుకున్నంత సులభం కాదు. అయినా 50 ఏళ్లు దాటిన వారు కూడా రకరకాల కారణాలతో విడిపోతున్నారు. దశాబ్దాల పాటు కలసి బతికిన వారిని ఇప్పుడు విడిపోవడానికి పురికొల్పుతున్నది ఏమిటి' అనేది ఆ పోస్ట్ సారాంశం.



విచారణ

విచారణకు రాలేను



- రాజ్‌తరుణ్

రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య ప్రేమ వ్యవహారం కేసులో విచారణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ నెల 18న విచారణకు హాజరవ్వాలని నార్సింగ్ పోలీసులు రాజ్‌తరుణ్‌కు నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన గైర్హాజరయ్యారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని, విచారణకు హాజరవ్వలేనని రాజ్‌తరుణ్ పోలీసులకు తన న్యాయవాది ద్వారా వివరణ పంపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు కొత్త సినిమా చిత్రీకరణ, ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండడమే అందుకు కారణమని పేర్కొన్నారు. దీంతో రాజ్‌తరుణ్‌కు మరోసారి నోటీసులు ఇచ్చి, అప్పటికీ విచారణకు హాజరవ్వకపోతే తదుపరి చర్యలు చేపట్టాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

వివరణ

చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి

- బన్నీవాసు

'ఏ కుటుంబంలో అయినా ఒకరు తీసుకున్న నిర్ణయాల వల్ల కొన్ని సమస్యలు వస్తాయి. ఇలాంటివి మామూలే. వచ్చిపోతుంటాయి. సమయం వచ్చినప్పుడు 'మేం అంతా ఒక్కటే' అని మెగా - అల్లు ఫ్యామిలీ చాటి చెబుతుంది' అన్నారు నిర్మాత బన్నీవాసు. శుక్రవారం ఆయన ఓ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్లు అర్జున్ గత ఎన్నికల్లో వైసీపీ నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌కు ప్రచారం చేయడం మెగా-అల్లు కుటుంబాల మధ్య విభేదాలకు దారి తీసిందనే ప్రచారం కొన్నాళ్లుగా జరుగుతోంది. ఇదే విషయాన్ని పాత్రికేయులు బన్నీవాస్‌ను అడగ్గా, ఆయన 'అవును' అని గానీ, 'కాదు' అని గానీ సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. పాత్రికేయుల ప్రశ్నకు సమాధానమిస్తూ 'అవన్నీ చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి' అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. 'గడ్డు పరిస్థితుల్లో ఆ రెండు కుటుంబాలు ఒకరికి ఒకరు అండగా నిలిచాయి. ఏ కుటుంబంలో అయినా కొన్ని సార్లు చిన్న చిన్న గొడవలు వస్తుంటాయి. అంతమాత్రాన వారి అనుబంధం దెబ్బతిన్నట్లు కాదు. వాటినే హైలైట్ చేయడం మంచిది కాదు. నేను 20 ఏళ్లుగా మెగా-అల్లు ఫ్యామిలీని చూస్తున్నా. 'కుటుంబ సభ్యులందరూ కలసి ఉండాలని చిరంజీవి గారు ఎప్పుడూ కోరుకుంటారు. ప్రతి సంక్రాంతికి ఆయన కుటుంబ సభ్యులందరినీ తీసుకొని బెంగళూరు వెళ్తారు. మనమందరం ఒకటే అనే భావన కుటుంబ సభ్యుల్లో కలిగించాలనేదే ఆయన ఆలోచన' అని చెప్పారు.

క్షమాపణ

తప్పు చేశా... మన్నించండి

'హీరోయిన్ తమన్నా సాంగ్ ఉంటే చాలు... కథలో పస లేకపోయినా సినిమా హిట్టవుతుంది. ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి అలా తయారైంది' అంటూ ఓ ఇంటర్వ్యూలో తమిళ నటుడు పార్తీబన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దిగజారుడు వ్యాఖ్యలు చేశారంటూ కోలీవుడ్ చిత్ర పరిశ్రమ ఆయన తీరును తప్పుబట్టింది. దీంతో పార్తీబన్ క్షమాపణలు చెప్పారు. 'చిత్ర పరిశ్రమకు చెందిన అందరినీ నేను గౌరవిస్తాను. నటీనటులను తక్కువ చేసే ఆలోచన నాకు లేదు. నా మాటలు ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే నన్ను క్షమించండి' అని పార్తీబన్ కోరారు. రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో తమన్నా ప్రత్యేకగీతంలో నర్తించారు. అలాగే ఆమె లీడ్‌రోల్ పోషించిన 'బాక్' చిత్రం కూడా మంచి వసూళ్లను సాధించింది. ఈ నేపథ్యంలో ఆ రెండు సినిమాలను దృష్టిలో ఉంచుకొనే పార్తీబన్ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు.




ఆయ్.. అందరినీ ఆకట్టుకుంటుంది



'ఆయ్.. అనే టైటిల్ పెడితే ఒక ప్రాంతానికే పరిమితం అవుతుందా అని అనుకున్నాం. కానీ కథ బాగుంటే అందరూ ఆదరిస్తారనే నమ్మకంతో ఫిక్స్ చేశాం. ఈ కథను ఓకే చేసిన హీరో నితిన్‌కు అభినందనలు. అంతా ఓకే అనుకున్న తర్వాత ఎన్టీఆర్‌కు ఫోన్ చేశాను. 'ఫస్ట్ డే వరకూ మనం పుష్ చేస్తాం. ఆ తర్వాత సినిమా బాగుంటేనే ఆడుతుంది. ఎవరి కష్టం వారిదే. కథ బాగుందని అంటున్నారు కనుక చేసేయ్యండి' అని ఆయన చెప్పారు. ఈ సినిమాలో వర్షం కోసమే రూ. కోటికి పైగా ఖర్చు పెట్టారు. సినిమా చూస్తే మనం నిజంగానే ఆ ఊళ్లోకి వెళ్లి వర్షంలో తడుస్తున్నట్లుగా అనిపిస్తుంది' అన్నారు అల్లు అరవింద్. ఆయన సమర్పణలో నార్నే నితిన్ హీరోగా బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన 'ఆయ్' చిత్రం థీమ్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడారు. మంచి గోదావరి సినిమా తీశామనీ, స్నేహం గురించి ఇందులో చెప్పామనీ హీరో నార్నే నితిన్ చెప్పారు. ఈ సినిమా చూస్తుంటే నవ్వి నవ్వి బుగ్గలు నొప్పి పెడతాయని బన్నీ వాసు చెప్పారు. గోదావరి ప్రాంతాన్ని బేస్ చేసుకుని తీసిన సినిమాల్లో 'ఆయ్' బెస్ట్ అవుతుందని దర్శకుడు అంజి కె మణిపుత్ర చెప్పారు.

కొత్త ప్రపంచంలోకి తంగలాన్

తమిళ హీరో విక్రమ్ నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' విడుదల తేదీని ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా చెప్పారు. పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతి తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.



తీర ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

● పర్యాటక అభివృద్ధికి ఊతమివ్వనున్న తీర నియంత్రణ తాజా నోటిఫికేషన్ ● కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో జేసీ కార్తీక్


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కలెక్టరేట్, జూలై 19: సముద్ర తీర ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి, ఈ ప్రాంతంలో ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర నియంత్రణ నోటిఫికేషన్ (సిఆర్‌జెడ్ 2019) దోహదపడుతుందని జేసీ కె.కార్తీక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా నోటిఫికేషన్ మేరకు జిల్లా స్థాయి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాల్సి ఉందని పేర్కొంటూ, ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని దీనిని రూపొందిస్తారని తెలిపారు. ప్లాన్ రూపకల్పన కోసం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తీర నియంత్రణ నోటిఫికేషన్‌పై ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాలను రాష్ట్రస్థాయిలో ఏర్పాటైన పర్యావరణ ప్రభావ అంచనా కమిటీకి నివేదిస్తామన్నారు. 2011 నాటి తీర నియంత్రణ చట్టంతో సరిపోల్చి చూసినట్లయితే 2019 నోటిఫికేషన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు, పర్యాటక వసతులు కల్పించేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం దేశంలో 2011 నాటి సీఆర్‌జెడ్ నిబంధనలే అమలులో ఉన్నాయని, 2019 నోటిఫికేషన్‌కు అందరి ఆమోదం లభిస్తే, ఇది అమల్లోకి వస్తుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధి సుభాని మాట్లాడుతూ తీర నియంత్రణ నోటిఫికేషన్-2019 వల్ల వివిధ రకాల అభివృద్ధి పనులకు, పర్యాటక వసతులకు, మత్స్యకారులకు లభించే వెసులుబాట్లను వివరించారు. తీర నియంత్రణ చట్టంలో భాగంగా 50 మీటర్ల లోపు, 100 మీటర్లలోపు, 200 మీటర్లలోపు అనుసరించే కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన పలు మత్స్యకార ప్రజా ప్రతినిధులు తీర నియంత్రణ చట్టంపై తమ అభిప్రాయాలను తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధిచేసిన తర్వాత మాత్రమే సముద్రంలోకి విడిచిపెట్టేలా నియంత్రణ చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలిని వారు కోరారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీరు సరిత, మత్స్యకార ప్రతినిధులు బర్రి చిన్నప్పన్న, మైలపల్లి సింహాచలం, తాత, అప్పలసూర్యనారాయణ, నూకరాజు, పతివాడ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

జగన్ భూదోపిడీకి అంతేలేదు


సమావేశంలో మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట, జూలై 19: వైసీపీ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భూదోపిడీ గత అయిదేళ్లలో రూ.35 వేల 576 కోట్లని ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం ఆమె నియోజకవర్గ నేతలతో కలిసి ఎల్‌కోటలో గల తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క భూమినీ వదలకుండా జగన్ లాక్కున్నాడని, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశాడని మండిపడ్డారు. విశాఖలో జగన్ భూదందాకు అడ్డులేకుండా పోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల విలువైన భూములను కబ్జా చేశాడని విమర్శించారు. ఇటువంటి వ్యక్తికి ఏ శిక్ష వేయాలో న్యాయమూర్తిలకే అర్థం కాలేదన్నారు. డబ్బులు పంచుతున్నాడనే సందడిలో ప్రజలు జగన్ మాయను చూడలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, కొల్లు రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, కోళ్ల శ్రీను, కొట్యాడ ఈశ్వరరావు, ఎర్నయుడు, తిక్కాన చినదేముడు, లాలం అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వేల్ఫేర్ డేని నిర్వహించి సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని కలిసి వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ విజయనాద్ పాల్గొన్నారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

రాజాం రూరల్: ఈనెల 20న జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాసంఘం చైర్మన్, సీనియర్ న్యాయాధికారి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలియజేశారు. మోటారు వాహనాల చట్టం, నియమ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, ర్యాగింగ్ -దుష్ఫలితాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు న్యాయాధికారి ఆనంద్ శ్రీనివాస్ ప్రకటనలో వివరించారు.

25న సోమరాజుపేటలో గ్రామసందర్శన

రేగిడి: ఈ నెల 25న మండలంలోని సోమరాజుపేటలో గ్రామసందర్శన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శ్యామలా కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 సాయంత్రం 5 వరకు నిర్వహించనున్న గ్రామ సందర్శనలో అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

రామభద్రపురం: గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరని స్థానిక రేణు గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ శాంతకుమారి తెలిపారు. నూతన కూటమి ప్రభుత్వం 3 సిలెండర్లు ఇవ్వనున్న నేపథ్యంలో ప్రతి గ్యాస్ కస్టమర్ ఈ నిబంధన తెలుసుకుని, వీలైనంత త్వరగా ఈకేవైసీ పూర్తిచేయించుకోవాలన్నారు.

సీపీఆర్ విధానంపై అవగాహన

విజయనగరం దాసన్నపేట: నగర శివార్లలోని ఆర్‌కే టౌన్‌షిప్‌లోని జీఎంఆర్ వరలక్ష్మీ ఉపాధి శిక్షణ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి, కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, సురేష్, సీపీఆర్ విధానంపై ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సంస్థ ఇన్‌ఛార్జి కేవీ రమణ మాట్లాడుతూ పాముకాటు, కరెంటు షాక్, భయం లాంటి కారణాలు కూడా కార్డియాక్‌కు దారితీస్తాయని, అటువంటి సమయంలో సీపీఆర్ ప్రాథమిక చికిత్సతో ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ప్రతినిధి సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం పాట వాయిదా

కొత్తవలస: కొత్తవలస వారపు సంతలో ఆశీలు వసూలు చేసుకునేందుకు శుక్రవారం జరగాల్సిన వేలం పాటను వాయిదా వేసినట్టు ఎంపీడీవో రమణయ్య తెలిపారు. భారీ వర్షాల కారణంగా వేలం పాటను వాయిదా వేస్తున్నామని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తవలస: వర్షాలు విస్తృతంగా కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీలో సిబ్బందికి, ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించి పలు అంశాలపై వివరించారు. జ్వరాలపై ఇంటింటి సర్వే చేయాలన్నారు. ● వర్షాల కారణంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వీఆర్వోలు తమ గ్రామాల పరిధిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

లక్కవరపుకోట: భారీ వర్షాల కారణంగా మండల స్థాయి అధికారులంతా అందుబాటులో ఉండాలని ఎంపీడీవో కే.రూపేష్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్, మెడికల్ ఆఫీసర్, ఈవోపీఆర్‌డీలతో సమావేశమయ్యారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

దస్తావేజుల రుసుం చెల్లించాలి

రామభద్రపురం: గ్రామపంచాయతీలకు గత కొన్నేళ్ల నుంచి దస్తావేజుల రుసుం చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాయని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు మజ్జి రాంబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆ నిధులను తక్షణమే పంచాయతీలకు జమ చేయాలని కోరారు. గత ప్రభుత్వం మళ్లించిన ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీల ఖాతాల్లో వేయాలన్నారు. మూడేళ్లుగా చిన్న చిన్న గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని, కనీసం సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో దుప్పలపూడి సర్పంచ్ వైకుంఠం విజయభాస్కరరావు, ఆరికతోట సర్పంచ్ ప్రతినిధి పెంకి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

పంట కాలువలన్నిటినీ శుభ్రం చేయాలి

బొబ్బిలి: వర్షాల నేపథ్యంలో పంటకాలువలన్నీ వరదనీటి ప్రవాహంలో నష్టపోకుండా వాటిని క్లియర్‌గా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పంటకాలువలను భ్రష్టుపట్టించారని ఆరోపించారు. నీటి వనరుల నిర్వహణ ఊసెత్తకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా అవసరమైన నిధులను మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన కాలువలను బాగు చేయించాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

రాజాం: పొగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మత్తులు, చెట్లు కొట్టించడం వంటి కారణాలు వలన ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా పొగిరి బొడ్డవలస గ్రామాలో పాటు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈవిషయం ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వైసీపీ హయాంలో అన్న క్యాంటీన్ల విధ్వంసం

● కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, జూలై 19: అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం విధ్వంసం చేసిందని, ఈ నేపథ్యంలో నిరుపేదలు, వృత్తిదారులు, రైతు కూలీలు ఇలా చాలా వర్గాలకు పట్టెడన్నం దూరమైందని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 15 నుంచి పునఃప్రారంభిస్తున్న అన్న క్యాంటీన్లకు సంబంధించి తన వంతు విరాళంగా రూ.10 వేల చెక్కును కలెక్టర్ అంబేద్కర్‌కి అశోక్ గజపతిరాజు తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తమిళనాడులో జయలలిత ఏర్పాటు చేసిన అమ్మ క్యాంటీన్లను తరువాత అధికారంలోకి వచ్చిన స్టాలిన్ ప్రభుత్వం కొనసాగించిందని గుర్తు చేశారు. ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటైన అన్న క్యాంటీన్లకు ఎంతో ప్రజాదరణ లభించిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లపై ఉక్కుపాదం మోపి, విధ్వంసం చేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పునర్విభజన పేరిట విజయనగరంలో ఐదు పాఠశాలలను ఎత్తేశారన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకి ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో 23 పాఠశాలలు ఎత్తేశారని రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారన్నారు. తిరిగి ఈ పాఠశాలలను తెరిపించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని చెప్పానన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని, దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.

ఆక్రమణలు పరిశీలించిన ఆర్డీవో

● సమాచారం ఇవ్వకపోవడంపై ప్రజాప్రతినిధుల అసంతృప్తి


ముషిడిపల్లి జగన్నాథచెరువులో వేసిన రోడ్డు చూస్తున్న ఆర్డీవో సూర్యకళ

శృంగవరపుకోట రూరల్, జూలై 19: గత ప్రభుత్వంలోని నాయకులు ముషిడిపల్లి పంచాయతీలో ఉన్న చెరువులు, డీపట్టా భూములను కబ్జాచేసి రోడ్లు వేశారని, డీపట్టా భూములు సైతం ఆక్రమించారన్న ఫిర్యాదుపై కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో ఆర్డీవో సూర్యకళ శుక్రవారం గ్రామానికి వచ్చి, చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, ఉపసర్పంచ్ మేడపురెడ్డి గణేష్, పంచాయతీ పాలకవర్గం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడం, రెండురోజుల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలోనూ ఈ తతంగంపై వాదన జరగడం వంటి అంశాలతో పాటు వీటిపై పత్రికల్లో వరుస కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం మధ్యాహ్నం ముషిడిపల్లి పంచాయతీకి వచ్చిన ఆర్డీవో ఆక్రమణ జరిగిన చెరువు ప్రాంతంతో పాటు డీపట్టా భూములు పరిశీలించారు. అయితే ఆర్డీవో పర్యటన విషయంపై రెవెన్యూ సిబ్బంది గోప్యత పాటించడంతో పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. తహసీల్దార్ తమకు కనీస సమాచారం అందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఫిర్యాదుదారులమైన తమను పిలిస్తే పూర్తిస్థాయిలో ఆక్రమణలు చూపించేవారమని, ఆర్డీవో కేవలం జగన్నాథచెరువులో 11 సెంట్ల ఆక్రమణ చూసి కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని చెప్పడం తమకు సమంజసంగా అనిపించడం లేదన్నారు. దీనిపై తహసీల్దార్ కిరణ్‌కుమార్ వివరణ కోరగా ఆర్డీవో వచ్చారని, చెరువులో వేసిన రోడ్డు చూశారని, కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాక తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

శాకంబరిగా అమ్మవారు


కొత్తవలసలో అమ్మవారు

కొత్తవలస: కొత్తవలస జంక్షన్‌లో నున్న దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవి శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పూలతో విశేషంగా అలంకరించారు.

జామి: జామిలో ఉన్న కనకదుర్గమ్మను శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భగవాన్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రమాదంలో మరొకరు మృతి

● మూడుకు చేరిన మృతుల సంఖ్య

మెంటాడ: మండలంలోని రాబంధ, మీసాలపేట గ్రామాల మధ్య ఈనెల 15న ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య మూడుకి పెరిగింది. దత్తిరాజేరు మండలం గదబవలసకు చెందిన కెల్ల సామమ్మ ఘటనాస్థలంలోనే మృతి చెందగా, విజయనగరం కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 17 న కోరాడ రాములప్పమ్మ మృతిచెందింది. కాగా, విశాఖ జి.జి.హెచ్‌లో చికిత్స పొందుతున్న అట్టాడ అప్పల కొండమ్మ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందింది. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. దీంతో గదబవలస గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సొంత ఇంటి కల నెరవేరుతుంది: కోండ్రు

రాజాం: చంద్రబాబునాయుడు పాలనలో పేదల సొంతింటి కల సాకారమయ్యే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంచరాం సమీపంలో అప్పట్లో టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లు నిర్మించిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వాటిని వదిలేసిందని అన్నారు. చంద్రబాబు నాయుడుకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో రాష్ట్రంలో మొత్తం నిర్మాణాలను నిలుపుదల చేసి దుర్మార్గానికి ఒడిగట్టాడని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, పేద లబ్ధిదారులకు త్వరలో అందజేస్తామని సీఎం హామీ ఇచ్చారని కోండ్రు తెలిపారు.

జేఎన్‌టీయూ పరిధిలో స్కౌట్స్ అండ్ గైడ్స్

విజయనగరం రూరల్, జూలై 19: హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రాజగిరి హరివిఠల్, రాష్ట్ర కార్యదర్శి దుంపల వెంకటప్పలనాయుడు, అసోసియేషన్ ద్వారా కళాశాలల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమకి వివరించి అనుమతి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు గొల్లపూడి పృధ్వీరాజ్, గుడివాడ కళ్యాణి, జీవీ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏవీ పాపారావు, పీడీ నాగరాజు, స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

కొత్తవలస, జూలై 19 : మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తో పాటు పలువురు శాసన సభ్యులు హాజరు కావలసి ఉండగా వర్షం కారణంగా రాకపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అప్పటికే కొంతమంది దివ్యాంగులు వివిధ ప్రాంతాల నుంచి రావడంతో చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఆందోళన

బొబ్బిలి: స్థానిక కోరాడవీధి శ్రీరామనగర్ కాలనీలో శుక్రవారం సాయంత్రం షార్టుసర్క్యూట్‌తో ఒక్కసారి పెద్ద శబ్దాలతో విద్యుత్ కాంతులు రావడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక అందరూ ఉలిక్కిపడ్డారని ఏఎంసీ డైరెక్టర్ సాధిక్ తెలిపారు.

24 సంవత్సరాలైనా రైతులకు డబ్బులు చెల్లించరా?

● వెంగళరాయసాగర్ కాలువకు భూమిలిచ్చిన రైతుల ఆవేదన

● చింతాడలో రైతులతో సమావేశం నిర్వహించిన స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్


రైతుల వాదనలను రికార్డు చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ

బొబ్బిలి, జూలై 19: బొబ్బిలి మండలం చింతాడ గ్రామంలో వెంగళరాయ సాగర్ అదనపు ఆయకట్టు పథకం పనులకు సేకరించిన భూముల రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చింతాడ సచివాలయంలో బొబ్బిలి భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకుని వాటిని నమోదు చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, న్యాయవాది తమ్మిరెడ్డి దామోదరరావు, గ్రామసర్పంచ్ బంకురు తిరుపతిరావు తదితర రైతులు తమ వాదనను వినిపించారు. గ్రామానికి చెందిన 35 మంది రైతుల నుంచి 10 ఎకరాల భూములను వెంగళరాయసాగర్ కాలువ నిర్మాణార్థం 24 సంవత్సరాల క్రితం భూసేకరణకు ఇచ్చారని, ఇంతవరకు దానికి అతీగతీ లేకుండా పోయిందన్నారు. వాస్తవానికి అప్పటి రైతులు చాలా మంది చనిపోగా, మరికొంతమంది తమ భూములను అమ్ముకున్నారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్ల తరువాత అది రద్దవుతుందని, మళ్లీ తాజాగా నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఎకరా ధర లక్ష రూపాయలేనని, పక్కనే తోటపల్లి కాలువల కోసం ఇచ్చిన భూముల ధరలు 20, 30 రెట్లు అధికంగా ఉన్నాయని రైతుల వాదన. తాజాగా నోటిఫికేషన్ ఇచ్చి కొత్త భూసేకరణ ధరలను తమకు చెల్లించాలని రైతులంతా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే కాలువ పథకాన్ని రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేయడంతో ఈ వాదనలన్నీ కలెక్టర్ సమక్షంలో వినిపించాలని ప్రమీలా గాంధీ రైతులకు సూచించారు. తన పరంగా నివేదికను సమర్పిస్తానని ఆమె తెలిపారు. ఆర్ఐ కల్యాణచక్రవర్తి, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా రాజ్యలక్ష్మి


ప్రొఫెసర్ జయలక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి శుక్రవారం వీసీ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యూనివర్సిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. యూనివర్సిటీలో ఎటువంటి సమస్యలు ఉన్నా..తన దృష్టికి తీసుకువస్తే.. పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన రాజ్యలక్ష్మిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, వివిధ విభాగాల డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని సందేశాలు స్ఫూర్తిదాయకం


విగ్రహావిష్కరణలో పాల్గొన్న బేబీనాయన, మాజీ ఎమ్మెల్సీ మాధవ్

బొబ్బిలి, జూలై 19: భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచస్థాయిలో చాటిచెప్పిన మహనీయుడు స్వామివివేకానందుని జీవిత విశేషాలను ప్రతి పౌరుడు ఔపోసన పట్టి ఆయన స్ఫూర్తితో యువత పనిచేయాలని ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. స్థానిక గొల్లవీధిలో సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉద్యోగి నక్కాన మాధవరావు సొంత నిధులతో నిర్మించిన 14 అడుగుల స్వామివివేకానంద విగ్రహాన్ని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్‌తో కలిసి ఎమ్మెల్యే బేబీనాయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ యువకుడైన మాధవ్ ఇదే స్ఫూర్తితో తమ వార్డులో వివేకానందుని విగ్రహాన్ని తన స్వార్జితంతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బొబ్బిలిలో గల గ్రంథాలయానికి స్వామి వివేకానందుని పేరు పెట్టాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నట్లు బేబీనాయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ గొలగాని రమాదేవి, జనసేన నేత పెద్దింటి మనోజ్‌కుమార్, బీసపు పార్వతీచిన్నారావు, భాను తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు వద్ద ఘాట్ నిర్మాణం

విజయనగరం రూరల్, జూలై 19: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరుల తల్లి పైడిమాంబ వనంగుడి వెనుక భాగాన ఉన్న పెద్ద చెరువు వద్ద ఘాట్ నిర్మాణానికి నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. తెప్పోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించే సందర్భంలో ఆ ప్రాంతమంతా బురదగా మారుతోంది. ఈ క్రమంలో పైడిమాంబ దేవస్థానం ఈఓ డీవీ ప్రసాదరావు నగర పాలక సంస్థ అధికారులకు ఈ విషయమై లేఖ రాశారు. చదురుగుడి మెట్ల ముందు కాలువ ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. ఎత్తు పెంచకపోవడం వల్ల నీరు నిల్వ ఉండడం.. పూడిక పేరుకుపోవడంతో వర్షాకాలంలో కాలువ నీరు బయటకు వస్తోంది. ఈ విషయమై శుక్రవారం నగర పాలక సంస్థ అధికారులు వచ్చి ఆలయం ముందు ఉన్న కాలువను పరిశీలించారు. అంచనాలు తయారు చేసి, ఈ కాలువ, రైల్వే స్టేషన్ వెనుక ఉన్న పెద్దచెరువు వద్ద ఘాట్ నిర్మాణం అక్టోబరులోగా పూర్తి చేయాని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

పైడిమాంబ ఆలయంలో చండీహోమం


చండీ హోమంలో భక్తులు

నగరంలోని మూడు లాంతర్లు రోడ్డులో ఉన్న పైడిమాంబ ఆలయం వద్ద శుక్రవారం చండీహోమాన్ని నిర్వహించారు. ఈఓ డి.ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, దేవస్థానం ఉద్యోగులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు.

పన్నుల లక్ష్యాలను సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ పరిధిలో అన్ని రకాల పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి లక్ష్యాలను సాధించాలని కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక కౌన్సిల్ సమావేశ హాలులో శుక్రవారం ఆమె సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. పన్నుల ప్రక్రియపై సమీక్షించారు. ప్రగతి చూపించలేని సెక్రటరీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి పి.ప్రసాదరావు, ఆర్ఐ త్రినాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తాం: డీఈవో

రాజాం: జిల్లాలో గల అన్ని కేజీబీవీలలోనూ గెస్ట్ ఫ్యాకల్టీని నియమించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా సమగ్రశిక్ష అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో 'కేజీబీవీల్లో బోధన మెరుగయ్యేనా' అనే శీర్షికతో వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రా కపోవడంతో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించలేదన్నారు. జిల్లాలోని 26 కేజీబీవీల్లో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 13 పీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బేబీనాయన

తెర్లాం: మండలంలోని విజయరాంపురం, పనుకువలస, డి.గదబవలస గ్రామలలో ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ నాయకుల కుటుంబాలను ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం పరామర్శించారు. చనిపోయిన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, మండల నాయకులు రమేష్, సర్పంచ్ రమేష్, బూరి శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీసీ అప్పారావు మనవారే


చిప్పాడ అప్పారావు

రేగిడి: తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపకులపతిగా నియమితులైన ఆచార్య చిప్పాడ అప్పారావు రేగిడి మండలం వారే. ఆయన సరసనాపల్లిలో జన్మించారు. ఎస్వీయూలో డీన్‌గా, బయోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనకు అరుదైన అవకాశం లభించింది. అప్పారావు సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఎస్వీయూ ఇన్‌చార్జ్ ఉపకులపతిగా నియమించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన తండ్రి అప్పాలస్వామి పొందూరు ఎంఈవోగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఆయన తల్లి సీతమ్మ గృహిణి.

కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలి

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో కోర్టు భవనాల సముదాయానికి నిధులు మంజూరు చేయించాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయనను)ను బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహనమురళీకుమార్, కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. నూతన భవనాల సముదాయం నిర్మించేందుకు అవసరమైన రూ.32 కోట్లు విడుదల చేయించాలని కోరారు. న్యాయవాదులు కండాపు ప్రసాదరావు, అమరాపు రామకృష్ణ, చల్లారపు సత్యనారాయణ, జాగారపు శ్రీనివాసరావు, మత్స ఆనంద్‌కుమార్, మంతిన సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

విజయనగరం క్రైం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విజయనగరం వన్‌టౌన్ సీఐ వెంకటరావు సూచించారు. శుక్రవారం సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నిబంధనలు సత్ప్రవర్తన, మత్తుపదార్థాలతో జరిగే అనర్థాలపై శ్రీనివాసా కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం, అక్రమ రవాణాతో పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో ఉద్యోగాలకు అనర్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల లక్ష్యాలను పూర్తి చేయాలి

రాజాం: ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయించాలని ఆదేశించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కొండ దిగితేనే వైద్యం

● మైదాన ప్రాంతంలోనే వైద్యసిబ్బంది సేవలు

● ఆర్ఎంపీలే గిరిజనులకు దిక్కు


దబ్బగుంట వద్ద ఆర్ఎంపీతో వైద్యసేవలు పొందుతున్న గిరిజనులు

శృంగవరపుకోట రూరల్: గిరిశిఖర ప్రాంతాల్లోని గిరిజనులకు జబ్బు చేస్తే వారు కచ్చితంగా మైదాన ప్రాంతానికి వస్తేనే వైద్యం అందుతుంది. వీరు ప్రతి శుక్రవారం కొండ దిగి వైద్యసేవలు పొందడం పరిపాటిగా మారింది. ఈ సమీప ప్రాంతాల్లో వైద్యసేవలపై శుక్రవారం పరిశీలించగా.. దారపర్తి గిరిజనులు పదుల కిలోమీటర్లు కొండ దిగి ఆర్ఎంపీల వద్ద వైద్యసేవలు పొందుతున్నారు. కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది ప్రతి శుక్రవారం గిరిజనుల కోసం ఇక్కడే కాపుకాసి వారికి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ విషయంపై గిరిజన యువత మట్లాడుతూ దారపర్తి పంచాయతీలో 14గ్రామాల ప్రజలకు దిగువ స్థాయి సిబ్బంది వచ్చి మందు బిళ్లలు ఇచ్చి వెళ్తారని.. ఇంజక్షన్ కావాలంటే ఆర్ఎంపీలు చేస్తారన్నారు. గిరిశిఖర గ్రామాల్లో హెల్త్ సబ్‌సెంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

● రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

పాచిపెంట: కుల, మత భేదాలు, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీటీసీ, సర్పంచ్‌లకు గౌరవం ఉంటుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరి శిఖర గ్రామాల్లో తాగునీరు, విద్యకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. రహదారులకు ప్రతిపాదనలు పంపించే ముందు అటవీ, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో రెండేసి కిలోమీటర్ల చొప్పున అభివృద్ధి చేద్దామన్నారు. పెద్దగెడ్డ ప్రాజెక్టుకు అనుసంధానమైన కర్రివలస వేగావతి ఆనకట్ట కుడి, ఎడమ కాలువల్లో పూడికలు తీయించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణాలపై విచారణ

వైసీపీ నాయకులు, కార్యకర్తల అనుచరులకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తారు. దీనిపై మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ సంబంధిత అధికారులకు విచారణ జరపాలని ఆదేశించారు. పాచిపెంటలో గల పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల కొరతను గిరిజన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశంలో విన్నవించుకోగా భవనాలు, ఉపాధ్యాయులు కొరత సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఎంఈవో పి.జోగారావుకు ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీపీ బడ్నాన ప్రమీల, జెడ్పీ వైస్ చైర్మన్ కొర్రజన్ని సింహాచలం, మండల ప్రత్యేకాధికారి శివప్రసాద్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

సామాన్యులకు అందుబాటులో నిత్యావసరాల ధరలు

పాచిపెంట: సామాన్యులకు ఇకపై నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా రైతుబజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాలు ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పాచిపెంటలో ఏర్పాటుచేసిన నిత్యావసర సరుకుల దుకాణాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా పాచిపెంట రావడంతో ఘనంగా స్వాగతించారు. ఊరేగింపుగా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ఆనందం

● ఎమ్మెల్యే విజయచంద్ర


పెదంకలాం కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంతో ఆనందం ఉంటోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

పెదంకలాం కాలువ నీరు విడుదల

సీతానగరం (బలిజిపేట): మండలంలో ఎంతో కాలంగా అభివృద్ధికి దూరంగా ఉన్న పెదంకలాం కాలువలో పూడికలు, గడ్డి తొలగించి రైతులకు అండగా నిలిచేందుకు టీడీపీ ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం పెదంకలాం కాలువ నీటిని ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ నాయకులు పెంకి వేణుగోపాల్‌నాయుడు, రామ్మోహనరావు, గౌరునాయుడు, పెదపాపినాయుడు, ఎం.అప్పారావు, సింహాచలం, డీఈ తిరుమలరావు, ఏఈ కవిత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

సాలూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఇష్టాలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 40శాతం ఓట్లుతో ఉన్న వైసీపీ నాయకులపై దాడులు ఆపాలని కోరారు. ఈ సమావేంలో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

సీతంపేట: గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ ఉపవిద్యాశాఖాధికారి పాలక నారాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం ముత్యాలు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాలు కురుస్తుండడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. వేడినీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో చిరంజీవులు, పాఠశాల హెచ్‌ఎం అమల పాల్గొన్నారు.


ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న పాలక నారాయుడు

కచ్చితంగా నియమాలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

జియ్యమ్మవలస: వాహన చోదకులు ఖచ్చితంగా రోడ్డు భద్రతా నియమ నిబంధనలు పాటించాల్సిందేనని అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.సత్యనారాయణ, ఎస్.రమేష్ కుమార్, బి.కాశీరాంనాయక్‌లు అన్నారు. శుక్రవారం వారు శిఖబడి జంక్షన్ వద్ద ట్రాక్టర్ ఓనర్లు, డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డుపై వాహనం వచ్చాక ఎటువంటి ప్రమాదం జరిగినా దానికి ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ ఇద్దరూ పూర్తి బాధ్యత వహించాలని అన్నారు.

గిరిజన యువతకు అండగా పోలీసు శాఖ

మక్కువ: గిరిజన యువతకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్‌ఐ పి.నరసింహమూర్తి అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మండలంలోని మూకవలస, గుంటభద్ర, అలగురువు, బొడ్డు సామంతవలస, పనసభద్ర గ్రామాల్లో గిరిజన యువతకు శుక్రవారం వాలీబాల్, నెట్ కిట్లును పంపిణీ చేశారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణతో ప్రయోజనం

కురుపాం: ఉపాధ్యాయులు శిక్షణ పొందడం ద్వారా నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని డీఈవో పగడాలమ్మ కోరారు. కురుపాం ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులకు గురు, శుక్రవారాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని డీఈఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, ఎంఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో పగడాలమ్మ

ఎన్‌సీసీ క్యాడెట్‌ల ఎంపిక

భామిని: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎన్‌సీసీ జూనియర్ డివిజన్‌కు క్యాడెట్‌లను ఎంపిక చేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్ పరీక్షలు నిర్వహించి 45 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ ఎన్‌సీసీ అధికారులు, ఫిజికల్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే నరకమే..

● బురదమయంగా సీమలవానివలస రహదారి

గరుగుబిల్లి: శివ్వాం పంచాయతీ సీమలవానివలస గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి బురదమయంగా తయారయ్యింది. గత కొన్నాళ్లుగా బీటీ రహదారి ఏర్పాటు చేయాలని అనేక సార్లు వినతిపత్రాలు అందించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిందంటే గ్రామంలోకి వెళ్లేందుకు నరకం చూడాల్సిందే. ఏ మాత్రం జారిపడినా నాగావళి కుడి కాలువలోకి వెళ్లాల్సిందేనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామంలోని పాఠశాల పూర్తిస్థాయిలో శిథిలమయ్యింది. వర్షం కురిస్తే పాఠశాల వర్షపు నీటితో నిండిపోతుంది. అలాగే రక్షిత తాగునీటి పథకం మరమ్మతులకు గురయ్యింది. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


సీమలవానివలసకు వెళ్లే రహదారి బురదమయంగా ఉన్న దృశ్యం

అన్న క్యాంటీన్ భవనం పరిశీలన


అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పాలకొండ: పట్టణంలోని శ్రీకోటదుర్గమ్మ ఆలయానికి సమీపంలో అన్నక్యాంటీన్ భవనాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల 15న అన్న క్యాంటీన్ ప్రారంభమవుతుందన్నారు. పేద ప్రజలకు రూ.5కే కడుపునిండా భోజనం అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు అభిమతమన్నారు ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్ కుమార్, నాయకులు వెన్నపు శ్రీనివాసరావు, హనుమంతు తమ్మారావు, హిమరిక ప్రసాద్, సుంకరి అనీల్‌దత్, గుప్తా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: మన్యం జిల్లాను ప్రభుత్వ శాఖల ఉమ్మడి భాగస్వామ్యంతో డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడానికి విస్తృత చర్యలు తీసుకోనున్నట్టు ఏపీ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ సారథ్యంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్వో కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవ ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: గొరడ, రాయగడ జమ్ము, పెంగవ, బాతుగుడబ గ్రామాల్లో నాబార్డు సహకారంతో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను డీడీఎం సాధు దినేష్ శుక్రవారం పరిశీలించారు. గొరడలోని తాడంగి బంగార్రాజు, పెంగవులోని పువ్వల ఈలె, రాయగడ జమ్ము గ్రామంలోని పువ్వల లక్ష్మీ, పువ్వల సరోజని, శ్రీను, బాతుగుడబ లోని కిల్లక వెంకటేష్, కిల్లక రాజారావు తదితర జీవ రైతుల క్షేత్రాలను పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఏడాది పొడువునా పంటలు పండించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జట్టు ట్రస్టు ముఖ్య సలహాదారు డాక్టర్ డి.పారినాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహారాజ్, కో-డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, జీవ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.ప్రబోధ్, కో-ఆర్డినేటర్లు మురళీమోహన్, గోవిందరావు, శివ, శ్రీహరి, సుబ్రహ్మణ్యం, సంతోషి, ప్రశాంత్, కిల్లక వెంకటేష్ పాల్గొన్నారు.


రాయగడ జమ్ములో సేంద్రియ వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం

సాగునీరు నిలుపుదల

గరుగుబిల్లి: తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని ఎడమ ప్రధాన కాలువ నుంచి సాగునీరు నిలుపుదల చేశారు. గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురవడంతో కాలువలకు గండ్లు పడే అవకాశం ఉందని ముందస్తుగా గుర్తించి నీటి సరఫరాను శుక్రవారం నిలుపుదల చేశారు.


ఎడమ ప్రధాన కాలువ నుంచి సాగునీరు నిలుపుదల చేసిన దృశ్యం

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

● జాయింట్ కలెక్టర్ శోభిక


పార్వతీపురం రూరల్: గ్రామాల్లో పర్యటిస్తున్న జేసీ శోభిక


పాలకొండ: అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురం రూరల్: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, దీనిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే బాధ్యత గ్రామస్థాయి అధికారులదేనని జేసీ శోభిక స్పష్టం చేశారు. శుక్రవారం లక్ష్మీనారాయణపురం గ్రామంలో పారిశుధ్య వారోత్సవాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి బి.నరేంద్ర, వీఆర్‌వో పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తం

పాలకొండ: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అతిసార, సీజనల్ జ్వరాలపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పాలకొండ ఆర్డీవో వీవీ రమణ సూచించారు. గోపాలపురం, గొట్ట మంగళాపురంలో పారిశుధ్యంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాగునీటి బోర్ల దగ్గర క్లోరినేషన్ చేయించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్, ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, గోపాలపురం సర్పంచ్ సిరిపురపు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సాలూరు రూరల్: ఖరాసవలస గ్రామంలో గతం వలే వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి అన్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ఈవోపీఆర్డీ ప్రసాద్ పర్యవేక్షణలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇంటింటికెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యుగంధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేలా అధికారులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలతో పాటు ఇంటింటా కరపత్రాలను అందిస్తూ అవగాహన కల్పించారు. గొట్టివలస సచివాలయ కార్యదర్శి టి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు. ● **భామిని:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో కిషోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం భామిని కాలనీలో పారిశుధ్యంపై ర్యాలీ నిర్వహించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** కిమ్మి గ్రామంలో శుక్రవారం పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● **సీతానగరం:** మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో పారిశుధ్య పక్షోత్సవ వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని అన్ని వీధుల్లో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ కుమార్‌వర్మ, ఏవో ఎస్.అవినాష్, ఎంఈవోలు సూరిదేముడు, వెలుగు ఏపీఎం శ్రీరాములునాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సాలూరు రూరల్: ఖరాసవలసలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఒడిశా

మౌలిక వసతులు మెరుగు పర్చాలి

రాయగడ: మానవ జీవనానికి అవసరమయ్యే మౌలిక వసతులు మెరుగు పరచాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకా అన్నారు. రాయగడ సమితి అధ్యక్షురాలు టునిహాయిక అధ్యక్షతన శుక్రవారం స్థానిక సమితి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న 28 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు.. ఆయా గ్రామాల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఉలకా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో అశ్రద్ధ వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు టుని హాయిక, రాయగడ శాసన సభ్యుడు అప్పలస్వామి కద్రక, జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, బీడీవో అమూల్య సాహు అధికారులు పాల్గొన్నారు.


వేదికపై ఉలకా, అప్పలస్వామి, టుని, సరస్వతి, సాహు

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వన మహోత్సవం

రాయగడ: చందిలి పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ హరీష్ బీసీ అధ్యక్షతన శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సార్జెంటులు, కానిస్టేబుళ్లు పాల్గొని వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు, చూడమణి నాయక్, కబిబర్ డెహూర్ సచ్చితానంద నాయక్, రాజేష్‌కుమార్ లక్రా తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎస్పీ

పోలీసుల అదుపులో

అంతర్రాష్ట్ర బైకు దొంగలు

రాయగడ: చందిలి పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర బైకు దొంగలను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చందిలి పోలీసు స్టేషన్ పరిధి అమలాపేటకు చెందిన ఏకామ్ర మహారాణా ఈనెల 9న తను పనిచేస్తున్న కార్యాలయం ఎదుట బైకును ఉంచి లోపలికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైకు కనిపించకపోవడంతో చందిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా బోగోలు మండలం బిట్రగుంటకు చెందిన బాణాల రవి, పేటల నవీన్, బాణాల జక్రి అనే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు బైకులు, రూ.23వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించారు.


పోలీసుల అదుపులో నిందితులు

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

రాయగడ: ద్విచక్ర వాహనాల చోరీ కేసులో రాయగడ పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని గురువారం కోర్టులో హాజరు పరిచారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. రామకృష్ణనగర్‌లో నివాశముంటున్న వంశీధర్ షడంగికి చెందిన బైకు ఈనెల 2న చోరీకి గురైనట్లు షడంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు కేసును ఐఐసీ కేకేబీ కహర్ నేతృత్వంలో ఎస్‌ఐ గాయత్రి బురుడా ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితులు కార్తిక్‌నాగ్, కె.కృష్ణారావు, డి.భరత్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకటి వంశీధర్‌దిగా గుర్తించిన పోలీసులు శుక్రవారం అతనికి బైకు అందజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


బిటివాడలో తుఫాన్ పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ జయ ప్రకాష్

వీరఘట్టం: మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ సూచించారు. శుక్రవారం బిటివాడ గ్రామంలో ప్రజలను కలిసి నదీ ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున నాగావళి నదికి పక్కన ఉన్న గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవీ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా..

పొలం పనులు చేస్తూ వ్యక్తి మృతి

మక్కువ: పొలం పనులు చేస్తూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని డి.శిర్లాం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కోట సూరిబాబు(65) శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడ పనులు చేస్తుండగా ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి మూర్చరోగం ఉన్నట్టు బంధువులు తెలిపారు.

నూతన ఎస్పీని కలిసిన సీఐ మంగరాజు

జియ్యమ్మవలస: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డిని చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.మంగరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సర్కిల్ పరిధిలో పరిస్థితులను ఆయనకు వివరించారు. కొత్తగా ఎస్పీగా వచ్చిన మాధవరెడ్డి ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో నేరాలు నియంత్రిస్తామని విలేకర్లకు తెలియజేశారు.


ఎస్పీకి మొక్కను అందజేస్తున్న సీఐ

శాకంబరిగా దుర్గమ్మ


శాకంబరి అవతారంలో నవదుర్గ

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని కొత్తవలస నవదుర్గా ఆలయంలోగల అమ్మవారు శుక్రవారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కురుపాం: స్థానిక రావాడ కూడలి వద్ద ఉన్న కోట దుర్గ అమ్మవారి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు.


శాకంబరిగా కోటదుర్గమ్మతల్లి